విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

పల్లెల్లో సంక్రాంతి శోభ

-సకుటుంబ సపరివార సమేతంగా సొంతూరికి
-మూడు రోజుల సంబరం ఆరంభం

విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు: పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. మూడు రోజుల సంబరం నేటి బోగి వేడుకలతో ప్రారంభం కానుంది. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగ నిర్వహించుకోనున్నారు. పండుగను సొంత ఊళ్లలో జరుపుకోవడానికి జనం పట్టణాలు వదిలి కుటుంబాలతో పల్లెలకు చేరు కుంటున్నారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్, ఇతర కూడళ్లు జనంతో రద్దీగా కనిపిస్తున్నాయి. పట్టణాల నుంచి కుటుంబసభ్యుల రాకతో ప్రతీ ఇల్లు సందడిగా మారింది. పిండివంటల ఘుమఘుమలు, ఇంటి ముందు అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు, బసవన్నలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.

సంక్రాంతి పండుగ ప్రారంభ తేదీ

ఖగోళ శాస్త్ర నిపుణులు తెలుపుతున్న సమాచారం మేరకు సూర్యుడు ఒక్కో మాసంలో ఒక్కో రాశిలోకి వస్తూ మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా సూర్యుడు మకర రాశి లోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణం లేదా మకర సంక్రాంతిగా చెప్పుకుంటారు. 2008 నుండి సంక్రాంతి పండుగ జనవరి 15న రావడం ప్రారంభమైంది. అంతకుముందు 1935 నుండి 2007 వరకు జనవరి 14ననే పండుగ జరిపేవారు. ప్రతి 72 సంవత్సరాలు ఒకసారి పండగ రోజు తర్వాత తేదీకి 2007 వరకు జనవరి 14న, 2008 నుండి 2080 వరకు జనవరి 15న, 2081 నుండి 2153 వరకు జనవరి 16న సంక్రాంతి పండుగ వస్తుంది. సాధారణంగా సూర్యుడు ధనురాశి నుండి మకర రాశిలోనికి ప్రవేశించిన నాడే సంక్రాంతి జరుపుకోవడం ఆనవాయితీ. ఆ రోజు నుండి మిధున రాశిలోకి ప్రవేశించేదాకా ఉత్తరాయణంగా వ్యవహరిస్తారు. ఇక సూర్యుడు ప్రతి సంవత్సరం మకర సంక్రమణం చేసినప్పుడు 20 నిమిషాలు ఆలస్యం అవుతోంది. స్థూల గణన ఆధారంగా ఇది మూడు సంవత్సరాలకు ఒక గంట, 72 ఏళ్లకు ఒకరోజు గా మారుతోంది. ఈ కారణంగా ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం 72 సంవత్సరాలకు ఒకసారి సంక్రాంతి తర్వాతి రోజుకు మారుతుంది. 2081నుండి 2153 వరకు జనవరి 16న వచ్చే సంక్రాంతి కొంతమంది చూసే అవకాశం లేదు.

సంప్రదాయాలతో ముడిపడిన సంక్రాంతి

సంక్రాంతి ఎన్నెన్నో సంప్రదాయాలతో ముడిపడి ఉంది. ఆధునిక పోకడలతో పండుగలు కొంత కళ తగ్గిపోతున్నా రంగవల్లులు తీర్చిదిద్దడంలో మహిళలు మాత్రం పోటీ పడుతూనే ఉన్నారు. చిన్నారులు పతంగులతో సందడి చేస్తున్నారు. సంక్రాంతిలో భాగంగా ఇళ్ళ ముందు వేసే ముగ్గుల్లో గొబ్బెమ్మలు ముఖ్యమైనవి. ఆవు పేడతో ముద్దలు చేసి ముగ్గుల మధ్యన పెట్టి పసుపు, కుంకుమ అద్ది పిండితో ముగ్గులు వేసే ఏర్పాటు చేస్తారు. ఈ గొబ్బెమ్మను గౌరిదేవిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాలలో సాయంత్రం వేళల్లో ఆటపాటలతో సంబరాలు జరుపుకుంటారు. పసుపు, కుంకుమ, పెసరపప్పు, శనగలు, మరమరాలు, అటుకులు మొదలైన వాటితో పూజలు పంచుకుంటారు.

నేటి అర్ధరాత్రి నుంచి భోగి సంబరాలు

సంక్రాంతి సంబరాలు ఆదివారం రోజున మంటలతో మొదలుకానున్నాయి. తెల్లవారుజామునే ఇళ్లల్లో ఉన్న పాత వస్తువులను కుప్పలుగా పోసి భోగిమంటలు వేస్తారు. పాత అలవాట్లకు స్వస్తి పలికి కొత్తదనాన్ని, కొత్త ఆలోచనలు కోరుకుంటూ భోగితో సంక్రాంతి స్వాగతిస్తారు. ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేస్తారు. పల్లెల్లో భోగిమంటల సంప్రదాయం ఇంకా ఉన్నా పట్టణాల్లో మాత్రం కనుమరిగిపోయింది. భోగి మంటలు చుట్టూ తిరుగుతూ భోగి మంటలతో కాగిన నీళ్ళతో స్నానం చేస్తారు. ఈ స్నానాలతో దుష్టశక్తులు తొలగిపోయి సంతోషంగా ఉంటారని భావిస్తారు.

భోగి పండ్లతో చిన్నారులకు ఆశీర్వాదం

భోగి పండ్లు అంటే రేగి పండ్లు. సూర్యుడి రూపం రంగు పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలు కలిపి పిల్లలపై పోసి ఆశీర్వదిస్తారు. పిల్లలు కూడా ఎంతో సంబరంగా వేడుకలలో పాల్గొంటారు. సాయంత్రం వేళ మహిళలు బొమ్మల కొలువు నిర్వహిస్తారు.

నోరూరించే ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే ముందుగా అందరికీ గుర్తు వచ్చేది పిండి వంటలు. నోరూరించే ఘుమఘుమలు స్వాగతం పలుకుతాయి. ప్రతి ఇంట గారెలు, సకినాలు, అరిసెలు వంటి రకరకాల పిండి వంటలు తయారు చేస్తారు. చిన్నా పెద్దా ఎంతో ఇష్టంగా తింటారు. సంక్రాంతి పండుగ పిండి వంటలలో ఓ ప్రత్యేకత ఉంది. బియ్యపు పిండి ప్రధాన ముడి సరుకుగా కరకరలాడే సకినాలు తయారు చేస్తారు. సంక్రాంతికి పది రోజుల ముందు నుంచే గారెలు, అరిసెలు, మురుకులు, చేగోడీలు, లడ్డూలు,పూస, చక్కెర పల్లీలు, వంటి పిండి వంటలు తయారీతో మహిళలు బిజీ,బిజీ గా కనిపిస్తున్నారు. తెలుగువారి సాంప్రదాయబద్ధమైన సంక్రాంతి పండుగ 3 రోజులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారు.

చారిత్రాత్మకం సచివాలయ వ్యవస్థ

- నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్

విశాలాంధ్ర-చాట్రాయి: గ్రామ సచివాలయ వ్యవస్థ చారిత్రాత్మకమైనదని నూజివీడు శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు కొనియాడారు. శనివారం చాట్రాయి మండలం తుమ్మగూడెం, పోతనపల్లి గ్రామాలలో సచివాలయ నూతన భవనాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 75ఏళ్ళ స్వతంత్ర భారతదేశంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించి ముఖ్యమంత్రి జగన్ నిరుపేదల ఇంటి ముంగిటకు సంక్షేమ పాలన అందించిన ఘనుడని కొనియాడారు. చాట్రాయి మండలంలో రూ.309 కోట్ల 21 లక్షల71వేల 353లను ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఏపి కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తుమ్మగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మలుగుమాటి మారెమ్మ, ఎంపీటీసీ ఎంకయ్య, తుమ్మగూడెం పిఏసిఎస్ చైర్‌పర్సన్ మాదాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాకార మండప నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి: శ్రీ పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ప్రాకార మండపం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తెలిపారు. శనివారం కలిదిండి శివారు భోగేశ్వరలంకలో కొలువై ఉన్న భోగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి, ఆర్థిక కమిటీలతో నిర్వహించిన సమావేశంలో డీఎన్నార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆలయ నిర్మాణమునకు సంబంధించిన కార్యచరణ ప్రజలలోకి తీసుకు వెళ్లవలసిందిగా కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం ప్రాకార మండప నిర్మాణ పనులను నాయకులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వర రావు, ఏఎంసి చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, పిఏసియస్ అధ్యక్షులు వడుపు రామారావు, కైకలూరు మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం : అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా 33వరోజు శనివారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహనరెడ్డి జోక్యం చేసుకుని తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి పనివర్ధిని, ఎన్ మార్తమ్మ, ఎం సత్యవతి, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఊక ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మండవల్లి: ఊక ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెరిగేగూడెం గ్రామంలో శనివారం జరిగిన ఘటనలో గుడివాడ మండలం నాగవరపుపాడు గ్రామం వైఎస్సార్ కాలనీకి చెందిన గడ్డం దానియేలు (17) కుమారుడు గడ్డం అనిల్ కుమార్ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. శనివారం తెల్లవారుజామున గ్రామస్తులతో కలిసి ట్రాక్టర్ లో ఊక లోడ్ చేసుకొని అన్లోడ్ చేయడానికి మండవల్లి మండలం పెరికే గూడెం గ్రామం దగ్గర ఫ్రోగన్ ప్రాజెక్ట్ దగ్గర ట్రాక్టర్లో ఉన్న

ఊకను హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా అన్లోడ్ చేస్తుండగా హైడ్రాలిక్ పెన్ విరిగిపోయి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రక్కు కుడివైపు పడ్డాడు. తీవ్ర గాయాల పాలైన అనిల్ కుమార్ ను కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు.ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మండవల్లి ఎస్ ఐ సిహెచ్.ఎస్ రామచంద్రరావు తెలిపారు.

సంక్రాంతి సందడి

విశాలాంధ్ర - లింగపాలెం : గ్రామాలలో సంక్రాంతి సందడి నెలకొంది. లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రజలు పండుగను సంప్రదాయంగా జరుపుకోవటంలో నిమగ్నమయ్యారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు, పిండి వంటలు, అల్లుళ్ళు, బంధువుల రాకతో మండలంలోని ప్రతీ ఇంటా హడావుడిగా ఉంది. ఇళ్ళ ముందు భోగి మంటలు వేసుకుని వాటి ముందు కోలాహలంగా సంబరాలు చేసుకున్నారు. పట్టణాలలో ఉండే కుటుంబ సభ్యులు సొంత ఇళ్ళకు చేరుకోవటంతో గ్రామాలలో రద్దీ పెరిగింది. ఇతర ప్రాంతాలలో, ఇతర దేశాలలో

ఉద్యోగ, వ్యాపారాలు చేసేవారంతా తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. ధర్మాజీగూడెంలో హోలిట్రినిటి పాఠశాలలో, ప్రతిభ కాలేజీలో, శివాలయంలో కోరమండల్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో రంగ వల్లుల పోటీలు నిర్వహించారు. ఇవి ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక్కడ సంక్రాంతి సంబరాలు చేశారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో అలరించారు. అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు. ఇతర ప్రాంతాలలో జరిగిన సంక్రాంతి సంబరాలలో మండలంలోని విద్యార్థులు వారి, వారి పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్‌లో ఏపీకి కాంస్యం

విశాలాంధ్ర - లింగపాలెం : జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఏపీ జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. మూడో స్థానం కోసం జరిగిన పోటీలలో ఉత్తరప్రదేశ్ జట్టుపై ఏజీ జట్టు విజయం సాధించి కాంస్య పతకాన్ని సాధించింది. ఏపీ జట్టులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ చూపారు. రాజస్థాన్‌లో నిర్వహించిన ఈ పోటీలలో ఈనెల 12 వరకు సాగాయి.

పోటీలలో ఏజీ జట్టు ఒడిస్సా, జార్ఖండ్, ఢిల్లీ, చండీఘడ్, ఉత్తరప్రదేశ్‌లపై గెలుపొందింది. ఏపీ క్రీడాకారుల జట్టు ప్రతిభను హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరాజు, జిల్లా కార్యదర్శి అలివేలు మంగ, రాష్ట్రంలోని ఇతర క్రీడా సంఘాల కార్యదర్శులు హ్యాండ్ బాల్ క్రీడాకారులను అభినందించారు.

లోకేష్‌ను కలిసిన బడేటి చంటి

విశాలాంధ్ర-ఏలూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను శనివారం టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఉండవల్లి లోని ఆయన ఇంటి వద్ద కలిసి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గం లోని పలు అంశాలపై చర్చించారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువజన క్రీడోత్సవాలు

విశాలాంధ్ర-చింతలపూడి: అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పాత చింతలపూడిలో సంక్రాంతి యువజన ఉత్సవాలు ప్రారంభించినట్లు ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి రాజు తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో గత 7 సంవత్సరాల

నుంచి సంక్రాంతి యువజన ఉత్సవాలు జరుగుతున్నా యన్నారు. 2 రోజులపాటు గ్రామంలో సంక్రాంతి యువజన ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా యువత సాంప్రదాయం పేరుతో కోడి పందాలు గుండాట పేకాట వైపు వెళ్లకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం కోసం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలను సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, పాత చింతలపూడి గ్రామ పెద్దలు ఎం ఇమ్మానియేలు, బోడ నాగభూషణం, పల్లె పరదేశి, బడా యేసు, గట్టు ప్రభ, గట్టు బాజ్జి, ముల్లగిరి లాజరు, తదితరులు ప్రారంభించారు.

ఏటి గట్టు పనులపై అపోహలొద్దు

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

విశాలాంధ్ర-నర్సాపురం: ఏటి గట్టు పటిష్ట పనులపై ఎటువంటి అపోహలకు పోవద్దని, ప్రతిపక్ష నేతల ఆరోపణలు అవాస్తమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు అన్నారు. పట్టణ పరిధిలో పొన్నపల్లి ఏటి గట్టు కుంగిన ప్రదేశంను

శనివారం ఆయన అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.28కోట్లు నిధులతో చేపట్టిన ఏటిగట్టు పటిష్ట పనులు 60శాతం మాత్రమే జరిగాయని, ఇప్పటికి ఒక్క రూపాయి బిల్లు కూడా రాలేదన్నారు. పనులు పూర్తి గాకుండానే అవినీతి జరిగిందని అనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వరదలు సమయంలో ఏటి గట్టు కోతకు గురై ప్రమాద బరితంగా ఉండటంతో అత్యవసర పనుల్లో భాగంగా యుద్ధ ప్రాతి పదికిన గట్టు పటిష్ట పనులు చేపట్టడం జరిగిందని, 400మీటర్ల మేర వరద పోటును తట్టుకునే విధంగా ఏటి గట్టు ను పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనులకు అంచనా విలువ రూ.28 కోట్లు అని, ఇవి సరిపోక పోతే మరిన్నీ నిధులు సమకూర్చి ఏటి గట్టు ను మరింత పటిష్టంగా అభివృద్ధి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రసాదరాజు వెంట మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ జయరాజు, నర్సాపురం సొసైటీ అధ్యక్షులు షేక్ బుల్లి మస్తాన్, పార్టీ పట్టణ అధ్యక్షులు భూసారపు జయప్రకాష్, రెడ్డప్ప దవేజి, మల్లాడి బుజ్జి, వల్లభుని శేఖర్, చిట్టూరి కృష్ణ తదితరులు ఉన్నారు.

టీడీపీ వర్సెస్ వైసీపీ

- పాలకొల్లులో ప్రోటోకాల్ వివాదం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలో టిడ్కో గృహాలకు సంబంధించి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేసే కార్యక్రమం పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ

నేపథ్యంలో పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో ప్రోటోకాల్ వివాదం తలెత్తింది. దీంతో టిడిపి, వైసిపి వర్గాల మధ్య తీవ్ర రగడ జరిగింది. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వర్గీయులు ఎమ్మెల్యే నిమ్మలకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ, నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నిమ్మల కూడా నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను పంపిణీ చేసే కార్యక్రమం రసాభసగా మారింది. ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ సభకు అధ్యక్షత స్థానిక ఎమ్మెల్యేకు ఇవ్వాలని, కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం ఏమిటంటూ ప్రశ్నించారు. ప్రోటోకాల్ పాటించకపోతే ఎలా అంటూ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చేతుల మీదుగా పట్టాల పంపిణీ చేశారు. కొందరికి తాళాలు ఇచ్చిన అనంతరం సభ నుండి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు వెళ్లిపోయారు. ఈకార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైసిపి పాలకొల్లు పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, మద్ద చంద్రకళ, పెచ్చెట్టి కృష్ణాజి, పాలకొల్లు మండల వైసీపీ కన్వీనర్ విప్పర్తి ప్రభాకర్ రావు, పెద్ద గోపురం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిర్రి వైపే గెలుపు గాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: చిర్రి బాలరాజు... ప్రస్తుతం పోలవరం నియోజకవర్గంలో ప్రతి నోట వినబడుతున్న పేరు. అతి సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఓ సాధారణ యువకుడు. నియోజకవర్గంలో బలమైన

నేతగా గుర్తింపు పొందిన రైతు బిడ్డ. ప్రజలకు సేవ చేయాలనే ఆకాంక్షతో పరుగులు తీస్తున్న గిరిపుత్రుడు. ఈ ఉత్సాహమే నియోజకవర్గంలో అందరికీ సుపరిచితుడిని చేసింది. జనసేన పార్టీ తరపున పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేసి తన ముద్రను వేసుకున్న బాలరాజు ఈసారి టిక్కెట్ కోసం శ్రమిస్తున్నాడు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఆయన బాటలో నడుస్తున్నాడు.. వెరసి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పర్యటిస్తున్న అతను పలకరింపులు, యోగక్షేమాలు తెలుసుకుంటూ తనదైన శైలిలో దూసుకుపోతున్నాడు.

నూజివీడుకు రైల్వేలైన్ సర్వే చేయించాలి

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: 350 ఏళ్ళ చరిత్ర కలిగిన చారిత్రాత్మక నూజివీడు పట్టణానికి విజయవాడ నుండి రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు తగిన సర్వే జరిపించాలని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ విషయమై ఇప్పటికే బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావుకు ఒక మెమోరాండం ఇవ్వటం జరిగిందని, రాజ్యసభ సభ్యులు రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవకు ఒక లేఖ ద్వారా తెలియజేసి, వ్యక్తిగతంగా కలిసి ఈ రైల్వే లైను సర్వే చేయాలని విజ్ఞప్తి చేసినట్లుగా ఐక్యవేదిక నాయకులు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, గోగినేని శ్రీనివాస అప్పారావు (బిజెపి), సామాజిక కార్యకర్తలు చాట్రాతి రామకృష్ణ, జి హనుమంతరావు, లోకాల ఉమామహేశ్వరరావు, పేర్కొన్నారు. మంత్రిత్వశాఖ సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులకు సర్వే పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లుగా తెలియజేశారు. నూజివీడు మామిడి పంటకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రాంతమని ఇక్కడ నుండి మామిడి ఎగుమతులు ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి పట్టణాలకు మామిడి సీజన్లో నిత్యం ఉంటాయని, నూజివీడు ప్రాంతంలోని సూరేపల్లి, సోమవారం ప్రాంతాలలో బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లుగా కనుగొనబడిందని, బొగ్గు గనుల తవ్వకానికి టెండర్లు పిలిచే దశలో ఉన్నదని, నూజివీడు పట్టణం బందరు పోర్టు రోడ్డుకు అనుసంధానించబడి ఉన్నదని బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే బందరు నుంచి ఎగుమతులు దిగుమతులు తెలంగాణ రాష్ట్రానికి, మధ్యప్రదేశ్లోని జగన్ పూర్ వరకు ఈ రోడ్డు మార్గంగానే జరుగుతాయని తెలిపారు. గుడివాడ, నూజివీడు స్టేషన్,నూజివీడు టౌన్ మీదుగా గాని లేక విజయవాడ, గన్నవరం, నూజివీడు టౌన్, విస్సన్నపేట, తిరువూరు మీదుగా గాని మధిర వద్ద ప్రధాన రైలు మార్గానికి అనుసంధానం చేస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వారు పేర్కొన్నారు. నూజివీడు శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు, ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ రావు, బిజెపి రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు రైల్వే లైన్ విషయమై ఇప్పటికే రైల్వే ఉన్నతాధికారులతో చర్చించినట్లు వారు రైల్వే లైన్ ఏర్పాటు చేయుటకు సుముఖంగా ఉన్నట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. విజయ వాడ-విశాఖపట్నం లైన్ నుండి విజయవాడ- ఖమ్మం లైన్ కు అనుసంధానం చేయ దానికి కూడా నూజివీడు ద్వారా ఈ లైన్ ఉపయోగపడుతుందని వారు తెలియజేశారు.

ప్రజా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-తణుకు: ప్రణాళిక బద్ధంగా సంఘ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ ఒప్పంద కార్మికుల సంఘం తణుకు శాఖ గౌరవాధ్యక్షులు బొద్దాని నాగరాజు తెలి పారు. శనివారం స్థానిక వంక సత్యనారా యణ స్వరాజ్య భవనంలో మున్సిపల్ ఒప్పంద కార్మికుల సంఘం తణుకు శాఖ నూతన కార్యవర్గ కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొద్దాని నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ ఒప్పంద కార్మి కుల సంఘం తణుకు శాఖ అధ్యక్షులుగా గంద్రాపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బిక్కవోలు వెంకటేష్, గూడేల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మందుల ముత్తయ్య, సహాయ కార్యదర్శిగా కొమ్మోత్తుల రవికుమార్,

గెద్దం వెంకటేశ్వరరావు, కోశాధికారిగా మార్లపూడి బర్నాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సంఘ కమిటీ సభ్యులకు బొద్దాని నాగరాజు అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కల్లేపల్లి రాము, గెద్దాడ అన్నపూర్ణ, అర్జీ శివ పార్వతి, సిర్రవాణి, కోమేరె సుజాత, మందుల చక్రవర్తి, సరేళ్ల అంజీ, బంగారు నూకరాజు, ముక్కెర రావులమ్మ,, అరుగోలు రమేష్, మందుల మంగమ్మ, రాయి తాతారావు, మందుల లక్ష్మి,, బండి మణి, మందుల యేసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

విశాలాంధ్ర - నిడమర్రు: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరిగిందని ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ అన్నారు. శనివారం నిడమర్రు మండలం, బువ్వనపల్లి గ్రామంలో 2.46 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్ర మాలకు ప్రారంభోత్సవాలు

చేశారు. ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) గ్రామంలో పలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, మూరా అలంకారం, రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, టీటీడీ బోర్డు మెంబర్ గాదిరాజు వెంకట సుబ్బరాజు(పెదబాబు), జడ్పిటిసి సభ్యులు కోడే కాశీ, ఎంపీపీ ఆదిలక్ష్మి, సంకు సత్య కుమార్, వెల్లంకి నరేష్, వైస్ ఎంపీపీ సమయం వీర రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

యువత సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: యువత సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పొట్టా రామారావు తెలిపారు. మర్రి గూడెం పంచాయితీ గట్టుగూడెం గ్రామంలో తెలుగు దేశం,జనసేన పార్టీల ఆధ్వ ర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా

సాంప్రదాయ క్రీడలు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలపట్ల ఆశక్తి పెంచుకోవాలి అన్నారు. 12 టీమ్ లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ లో మర్రి గూడెం పంచాయతీ లోని తీగల పల్లి టీమ్ మొదటి స్థానం, ఏపి గుంట పంచాయతీ లోని రామన్న గూడెం టీమ్ లు రెండవ స్థానాలు సాధించాయి.ఈ కార్యక్రమంలో కుంజా లోకేష్, తుట్టి రామ చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర -నూజివీడు టౌన్ : తెలుగువారి పెద్ద పండగ మకర సంక్రాంతి పురస్కరించుకుని పలు రాజకీయ పార్టీల నాయకులు నియోజకవర్గ ప్రజలకు శనివారం ప్రకటనలో శుభాకాంక్షలు అందించారు. ప్రస్తుత శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు, టిడిపి నూజివీడు నియోజకవర్గ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు కాపా శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు బర్మా ఫణి బాబు, మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఎస్. రామ్‌సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జనవరి 13 నుండి జనవరి 16 వరకు వ్యక్తి గత కారణాలపై సెలవు పై వెళ్లిన కారణంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఇన్చార్జి కలెక్టర్ గా విధులను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరేట్ నుండి ఒక ప్రకటనలో తెలియజేశారు.

ప్రజలకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-భీమవరం: మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని, ఇది పల్లెల పండుగ, రైతుల పండుగ, మన పాడిపంటల పండుగగా సంక్రాంతి నిలుస్తుందని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. స్వగ్రామాలకు తిరిగి వెళ్ళి, తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని, భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్ళు, రైతు లోగిళ్ళలో ధాన్యం రాసులు, పిండి

వంటలు, బంధు మిత్రుల సందళ్ళతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అన్నారు. సంక్రాంతి పండుగతో జిల్లాలోని ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకాంక్షించారు.

దేశానికే తలమానికంగా డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహం

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా నిలవ నుందని రాష్ట్ర ఎస్సికమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ సుమారు రూ.400 కోట్లతో విజయవాడ స్వరాజ్య మైదానంలో నిర్మించిన

అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. బడుగు,బలహీనవర్గాలవారు అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పొలిమేర హరికృష్ణ,మొండెం సంతోష్ కుమార్, మేతర అజయ్ బాబు, మత్తే బాబి జుజ్జువరపు రవి ప్రకాష్, గొల్ల కిరణ్ సంఘ మధు. తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

ముగ్గులతోనే సంక్రాంతికి నిండుదనం

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండల పోలీస్ కార్యాలయంలో ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు వారి సిబ్బందితో కలిసి సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మహిళలకు రంగవల్లి ముగ్గుల పోటీలు నిర్వహించి ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు

బహుమతులను అందజేశారు. ఎస్ఐ చంటి బాబు మాట్లాడుతూ ఆగిరిపల్లి ప్రజానీకానికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియపరచి ఈ సంక్రాంతిని మీ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆధునిక ప్రపంచంలో సంప్రదాయాలు కనుమరుగు అవుతున్నాయని సంప్రదాయాలు భావితరాల వారికి అందించాలనే దృఢ సంకల్పంతో గతంలో సంక్రాంతి పండుగ వచ్చే నెల రోజులు ముందుగా ప్రతి ఇంటి ముందూ ముగ్గులు వేయడం అనేది ఆనవాయితీ ఉండేది ఇప్పుడు పట్టణాలు, పల్లెలు కాంక్రీట్ జంగిల్ అవుతున్న నేపథ్యంలో మహిళలు ముగ్గులు వేయడం మానేస్తున్నారు అనే భావనతో భావితరాల వారికి సాంప్రదాయ అందివ్వాలి అనే సంకల్పంతో ఈ ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లుగా ఆగిరిపల్లి ఎస్ఐ తెలియజేశారు.

నూతన వ్యాపారానికి తోడ్పాటు నివ్వాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : నూతన వ్యాపార అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కోయ్యే మోషేన్‌రాజు

అన్నారు. జెపి రోడ్డులో జాజు మండి రెస్టారెంట్ అండ్ కేఫ్‌ను మండలి చైర్మన్ మోషేన్ రాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రారంభించి మాట్లాడారు. అద్భుతమైన రుచుల కావాలంటే ముందుగా గుర్తుకు వచ్చే ప్రదేశం భీమవరం అని, మండి బిర్యానీలతో రెస్టారెంట్‌లు ప్రారంభించడం అభినందనీయమన్నారు. అభిరుచులకు తగ్గట్టుగా రెస్టారెంట్ ఉండాలన్నారు. భూపతిరాజు విజయ రామరాజు, గౌతమ్ వర్మ, మనోజ్ వర్మ మాట్లాడుతూ మండి బిర్యానీలు మా ప్రత్యేకతలని, అన్ని రకాల బిర్యానీలు లభిస్తాయని, అందరూ వచ్చి రుచులు చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గాదిరాజు సుబ్బరాజు, ఏఎస్ రాజు, గొట్టుముక్కల వెంకట భీమరాజు, గొట్టుముక్కల సత్యనారయణ రాజు, సాగిరాజు వెంకట లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.